సాక్షి
విశాఖపట్నం
శనివారం । 4 । మార్చి । 2023



ఫోన్‌కు దూరంగా ఉంచుతాం

10వ తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ పిల్లలను టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచుతామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. IIలో



ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

నౌకల్లో సాంకేతిక పరిజ్ఞానంపై మత్స్యకారులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. నౌకల్లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. IIలో



కల్యాణం.. కమనీయం

పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అనంతుని కల్యాణం వైభవంగా జరిగింది. IIలో

న్యూస్‌రీల్

జీవీఎంసీకి ప్రతిష్టాత్మక అవార్డులు



అల్లిపురం: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ) నుంచి నీరు, విద్యుత్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించినందుకు గానూ గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకుంది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ఆర్.కె.సింగ్ చేతుల మీదుగా జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, సూపరింటెండెంట్ ఇంజినీర్ రవి ఈ అవార్డులను స్వీకరించారు. జల వనరుల సమర్థ వినియోగం, నీటి పునర్వినియోగ ప్రాజెక్ట్(ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, పారిశుధ్యం, నీటి సరఫరా) కేటగిరీల్లో జీవీఎంసీ ఈ అవార్డులు దక్కించుకుందని కమిషనర్ రాజాబాబు వెల్లడించారు. అల్ట్రా సోనిక్ ఫ్లో మీటర్లతో 25,000 గృహాలకు 24/7 నీటి సరఫరాను అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే మురుగునీటి శుద్ధి కర్మాగారాల్లో(ఎస్‌టీపీ) వచ్చిన వ్యర్థ జలాలను పారిశ్రామిక, ఉద్యానవన అవసరాలకు తిరిగి ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు.

జ్ఞానమే దేశ సంపద

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



మెడ్‌టెక్‌లోకి వెళ్తున్న కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

పెదగంట్యాడ (గాజువాక) : జ్ఞానమే దేశ సంపదని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. మండలంలోని మెడ్‌టెక్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ ఆత్మ నిర్భర్‌లో భాగంగా భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పాటుపడుతున్నారని చెప్పారు. శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మెడికల్ సైన్స్‌కు సంబంధించి గతంలో పెద్ద ఎత్తున పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లమని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. అత్యాధునిక పరికరాలను మెడ్‌టెక్ పార్కులోనే తయారు చేసి ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర శర్మ, శంకర్, బెనర్జీ పాల్గొన్నారు.

శిల్పారామంలో 5 స్టార్ హోటల్



శిల్పాలను పరిశీలిస్తున్న శ్యామసుందర రెడ్డి

పీఎంపాలెం : శిల్పారామంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర శిల్పారామాల ప్రత్యేక అధికారి డి.శ్యామసుందర రెడ్డి చెప్పారు. శుక్రవారం సాయంత్రం శిల్పారామాన్ని సందర్శించారు. ఇప్పటికే ఇక్కడ ప్రైవేటు యాజమాన్యం నిర్వహణలో వాటర్ పార్కు విజయవంతంగా కొనసాగుతోందన్నారు. శిల్పారామంలోని అన్ని కళాకృతులకు, కొత్తగా పెయింటింగ్ వేయించి సహజ సుందరంగా తీర్చి దిద్దుతున్నామన్నారు. అలాగే అవసరమైన చోట నిర్మాణాలకు మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఇటీవల సుమారు రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 7వ తేదీ నుంచి, రాయగడ-గుంటూరు ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 8వ తేదీ నుంచి మరో స్లీపర్ క్లాస్ కోచ్‌ను శాశ్వత ప్రాతిపదికన జత చేస్తున్నారు. విశాఖపట్నం-అమృత్‌సర్(20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 7, 11 తేదీల్లో, అమృతసర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 11, 15 తేదీల్లో అదనంగా మరో థర్డ్ ఏసీ కోచ్‌ను జతచేస్తున్నారు. విశాఖపట్నం-దుర్గ్ ఎక్స్‌ప్రెస్‌కు సంబల్‌పూర్ డివిజన్ కోమాఖాన్ స్టేషన్‌లో అదనపు హాల్ట్ కల్పించారు. ఈ అదనపు హాల్ట్ సెప్టెంబర్ 9వ తేదీ వరకు అమలవుతుంది.

విశాఖ కీర్తి విశ్వవ్యాప్తి



సీఎం జగన్‌తో జీఎంఆర్, ముఖేష్ అంబానీ మాటామంతీ

46 దేశాల ప్రతినిధుల సాక్షిగా .. ప్రపంచం గర్వపడే దిగ్గజ పారిశ్రామిక వేత్తల ఆగమనంతో విశాఖ మురిసింది. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖ పాలనా రాజధానిగా అవతరించనున్న తరుణంలో నిర్వహించిన సదస్సులో పెట్టుబడులు పోటెత్తి.. పరిశ్రమలు క్యూ కట్టడాన్ని సాదరంగా స్వాగతించింది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విభిన్న రంగాల్లో వేలకోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చి, ప్రభుత్వంతో భాగస్వామ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంతో విశాఖ ఖ్యాతి విశ్వవ్యాప్తం కానుంది.

– సాక్షి, విశాఖపట్నం



సదస్సుకు తరలివస్తున్న పారిశ్రామికవేత్తలు

దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక దిగ్గజాలను విశాఖకు తీసుకొచ్చింది రాష్ట్ర ప్రభుత్వం . ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్‌తో ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ తొలిరోజు విజయవంతంగా ముగిసింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలతో పాటు పర్యాటక రంగానికి చిరునామాగా విశాఖపట్నంను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి.. సమ్మిట్ తొలిరోజు అద్భుత ఫలితాలిచ్చింది. విశాఖ పరిపాలన రాజధానిగా అవతరించబోతోంది.. త్వరలోనే తాను కూడా విశాఖకు రాబోతున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు సదస్సులో పలువురు పారిశ్రామిక ప్రతినిధులు ఆసక్తి చూపారు. భవిష్యత్ విశాఖ రూపు రేఖలు మారేలా.. ఇక్కడ తమ కార్యలాపాలు విస్తరించేందుకు ప్రభుత్వంతో తొలి రోజున ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగ యూనిట్లు, పోర్ట్ ఆధారిత మౌలిక సదుపాయాలు, మెడ్‌టెక్ జోన్, టూరిస్ట్ హాట్‌స్పాట్‌లతో విశాఖ అత్యంత బలమైన ఆర్థిక కేంద్రంగా ఆవిర్భవించింది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక దిగ్గజాలు విశాఖపట్నం జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.



వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పారిశ్రామిక దిగ్గజాలు

- నగరంలో రూ.వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి
- ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్న పరిశ్రమలు, సంస్థలు

బీచ్‌రోడ్డులో ఆరు లైన్ల రాదారి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని, విశాఖ నగరాన్ని అనుసంధానం చేస్తూ నిర్మించాలనుకున్న ఆరు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవేకి కూడా మార్గం సుగమమైంది. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆరులైన్ల రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. పలుమార్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరులైన్ల వైజాగ్ పోర్టు హైవేకు సంబంధించిన ముఖ్యమైన డిమాండ్‌ను తన ముందుంచారని తెలిపారు. 55 కి.మీ మేర రూ.6,300 కోట్ల వ్యయంతో అంచనా వేస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మంజూరు చేస్తున్నట్లు సభా సమక్షంలో ప్రకటించారు. భోగాపురంలో నిర్మించే అంతర్జాతీయ విమానాశ్రయానికి విశాఖ నగరం నుంచి గంటలోపు వెళ్లేలా అద్భుతమైన రహదారి నిర్మించాలన్నది సీఎం వైఎస్ జగన్ సంకల్పం. ఇప్పటికే దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ పూర్తి చేశారు. ఎంత మేర భూమిని సేకరించాలి.. ప్రభుత్వ భూములు ఎంతమేర ఉన్నాయన్న వివరాలతో ప్రాజెక్ట్ సిద్ధమైంది. కేంద్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిన నేపథ్యంలో త్వరలో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కానుంది.

రెండో రోజున మరిన్ని పెట్టుబడులు

పర్యాటక రంగానికి కేంద్ర బిందువుగా ఉన్న విశాఖ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే అనేక సంస్థలు ముందుకొచ్చాయి. ఈ ఒప్పందాలన్నీ రెండో రోజైన శనివారం ముఖ్యమంత్రి సమక్షంలో జరగనున్నాయి. స్కై టవర్, స్నో వరల్డ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌తో పాటు స్టార్ హోటళ్లు, రిసార్టులు, బీచ్ రిసార్టులు.. ఇలా విభిన్నమైన ప్రాజెక్టులు విశాఖకు వచ్చే అవకాశాలున్నాయి.



మా తెలుగుతల్లికి గేయం ఆలపిస్తున్న సమయంలో గౌరవసూచికంగా నిల్చున్న వివిధ దేశాల ప్రతినిధులు







సమ్మిట్‌కు హాజరైన అసెంబ్లీ స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఉన్నతాధికారులు, పారిశ్రామిక వేత్తలు



దప్పు కళాకారుల ప్రదర్శన



తప్పెటగుళ్ల కళాకారుల విన్యాసాలు

ఉమ్మడి విశాఖలో తొలి రోజున ముఖ్యమైన పెట్టుబడులు ఇలా..

ప్రాజెక్టు	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి
ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ప్రాజెక్టు	1,10,000	61,000
వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డేటా సెంటర్, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ	21,844	39,815
అదానీ గ్రీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో పంప్డ్ స్టోరేజ్	6,330	4,000
ఒబెరాయ్ హోటల్	1,350	1,350
టూరిజంలో మరో 10 ప్రాజెక్టులు	1,000	1,500



సదస్సుకు వస్తున్న పలు సంస్థల ప్రతినిధులు

మురిసిన నగరం

- అతిరథ మహారథుల రాకతో కోలాహలం
- విశాఖను బలమైన ఆర్థిక కేంద్రంగా అభివర్ణించిన సీఎం జగన్



స్టాల్‌ను పరిశీలిస్తున్న ఔత్సాహికులు



సెల్ఫీ తీసుకుంటూ...

సాక్షి, విశాఖపట్నం : ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న పెట్టుబడుల పండగతో విశాఖ నగరంలో సందడి నెలకొంది. ప్రముఖ రాకపోకల హడావుడి, రోడ్ల వెంబడి అలంకరణలతో శుక్రవారం ఉదయం నుంచే వైజాగ్‌లో వాతావరణం మారిపోయింది. ముఖేష్ అంబానీ, కరణ్ అదానీ, నవీన్ జిందాల్, గ్రంధి మల్లికార్జునరావు, కృష్ణ ఎల్లా, అర్జున్ ఒబెరాయ్, దాల్మియా వంటి ప్రఖ్యాత పారిశ్రామిక దిగ్గజాలు, అతిరథ మహారథులు విశాఖలో అడుగిడడం, ఒకేసారి, ఒకే వేదికపై ప్రత్యక్షమవడం వైజాగ్ చరిత్రలో ఇదే తొలిసారి. వీరితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వంటి ముఖ్య నేతలు, పలువురు వీఐపీలు, వీవీఐపీలు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాలు పంచుకోవడంతో నగరం మురిసిపోయింది. 25 చార్టర్డ్ విమానాల్లో ప్రముఖులు నగరానికి విచ్చేశారు. ఉదయం 10.20 నిమిషాలకు సీఎం జగన్ రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని తోడ్కొని వేదికపైకి వచ్చారు. మా తెలుగు తల్లికి మల్లె పూదండ గీతాలాపన అనంతరం జ్యోతి ప్రజ్వలనతో సదస్సుకు శ్రీకారం చుట్టారు. వేదికపై ఉన్న ప్రముఖులు ఒక్కొక్కరుగా ప్రసంగిస్తుండగా, మధ్యలో ఆంధ్రప్రదేశ్‌లో వనరుల లభ్యత, అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా తెలియజేశారు. ప్రముఖుల్లో ఆఖరిగా అంబానీ, ఆ తర్వాత ముఖ్యమంత్రి జగన్ ప్రసంగించారు. ప్రముఖులంతా ఐదేసి నిమిషాల చొప్పున ప్రసంగించగా సీఎం 15 నిమిషాలకు పైగా ప్రసంగించారు. సీఎం తన ప్రసంగాన్ని ముగించే ముందు 'విశాఖ బలమైన ఆర్థిక కేంద్రం.. రాబోయే రోజుల్లో విశాఖ కార్యనిర్వాహక రాజధాని అవుతుంది, అందమైన ఈ నగరంలో అద్భుతమైన సమయాన్ని గడపాలని ఆశిస్తున్నాను' అనడంతో సభికుల నుంచి పెద్ద ఎత్తున చప్పట్లు మారుమోగాయి. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం పూర్తయ్యాక కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వచ్చారు. వివిధ స్టాళ్లతో కూడిన ఎగ్జిబిషన్ ప్రారంభించారు.

తొలిరోజు విజయవంతం: ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రముఖులు, పెట్టుబడిదారులు, డెలిగేట్స్, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నేతలతో సమ్మిట్ జరుగుతున్న ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం కిక్కిరిసి.. కోలాహలంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ్మిట్ ద్వారా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. అయితే తొలిరోజే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ ఆరు రెట్లు అధికంగా ఎంవోయూలు కుదిరాయి.

సెల్ఫీలు.. ఫొటోలు : జీఐఎస్ కోసం ఆ ప్రాంగణంలో తెల్లని జర్మన్ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేశారు. నేలపై పచ్చటి తివాచీలను పరిచారు. ప్రాంగణ ప్రవేశ ద్వారాన్ని, స్టీల్ బాక్సులతో వలయాన్ని, అడ్వాంటేజ్ ఆంధ్రప్రదేశ్ అక్షరాలతో తయారు చేసిన ఐకాన్‌ను రూపొందించారు. ఇవన్నీ సదస్సుకు వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. కడియం నుంచి తీసుకువచ్చిన అందమైన మొక్కలతో ప్రాంగణాన్ని అలంకరించారు. దీంతో అనేక మంది వాటి వద్ద సెల్ఫీలు దిగుతూ మురిసిపోయారు.

యువతలో నూతనోత్తేజం

'జీఐఎస్' విజయవంతంతో ఆనందం



సభా ప్రాంగణంలో పరిశ్రమల ప్రతినిధులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023(జీఐఎస్) నవశకానికి నాంది పలికింది. దిగ్గజ పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడంతో యువతలో కొత్త ఆశలు చిగురించాయి. కరోనా కారణంగా పారిశ్రామిక రంగం పూర్తిగా కుదేలైంది. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంతో యువత, నిరుద్యోగుల్లో ఆనందం వెల్లివిరిస్తోంది.

ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జీఐఎస్ సదస్సు తొలి రోజు గ్రాండ్ సక్సెస్ అయింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమ్మిట్‌ను తొలి నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దేశ వ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ప్రతినిధులు కలిసి.. రాష్ట్రంలో వనరులు, వసతులు, పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితులను వివరించారు. అలాగే ప్రణాళికాబద్ధంగా నిర్వహించిన సదస్సు పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో సఫలమైంది. ఈ నేపథ్యంలో దేశం గర్వించే పారిశ్రామిక దిగ్గజాలైన రిలయన్స్ సంస్థల అధినేత ముఖేష్ అంబానీ, సైయెంట్ గ్రూప్ చైర్మన్ బి.వి.ఆర్ మోహన్‌రెడ్డి, జిందాల్ గ్రూప్ చైర్మన్ నవీన్ జిందాల్, జీఎంఆర్ సంస్థల చైర్మన్ జి.ఎం. రావు, అదానీ పోర్ట్స్ సీఈవో కరణ్ అదానీ, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా తదితర పారిశ్రామికవేత్తలు స్వయంగా హాజరై.. ఏపీ అభివృద్ధికి సహకరిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 సెక్టార్లలో రూ.13.5లక్షల కోట్ల పెట్టుబడులతో ఆరు లక్షల ఉద్యోగ అవకాశాల కల్పన జరిపే అవకాశం ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించి యువతలో కొత్త ఉత్సాహం నింపారు. ఇప్పటికే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి 340 సంస్థలు ప్రతిపాదనలు ఇచ్చాయని ముఖ్యమంత్రి ప్రకటించారు. దేశానికి పారిశ్రామిక కేంద్రంగా రాష్ట్రాన్ని నిలపాలనే ముఖ్యమంత్రి ఆకాంక్ష సాకారం అవుతుండటంతో యువతలో నూతనోత్తేజం నెలకొంది. 'జీఐఎస్'ద్వారా తమకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని వారంతా ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన వనరులు, వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టమైన సంకేతాలనిస్తూ నిర్వహించిన ఈ సదస్సు విజయవంతం కావడం పట్ల విద్యార్థిలోకం, యువత అమిత సంతోషం వ్యక్తం చేస్తోంది.

విమానాశ్రయంలో సంప్రదాయ స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో సంప్రదాయ వాయిద్యాలతో స్వాగతం పలుకుతున్న కళాకారులు

గోపాలపట్నం: గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, విదేశీ ప్రతినిధులకు విశాఖ విమానాశ్రయంలో సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం లభించింది. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా శాస్త్రీయ సంగీతం, సంప్రదాయ నృత్యాభినయాలతో కళాకారులు పారిశ్రామికవేత్తలు, వివిధ దేశాల ప్రతినిధులకు స్వాగతం పలికారు. వారిని పూల దండలతో సత్కరించి.. పుష్పగుచ్ఛాలు అందజేశారు. శుక్రవారం ఉదయం 7.35 గంటలకు రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. ఆ తర్వాత పలు విమానాల్లో జిందాల్, దాల్మియా, అదానీ, అపోలో తదితర కంపెనీల అధినేతలు, ప్రతినిధులు విశాఖ వచ్చారు. సదస్సు ముగిసిన అనంతరం 3 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు.

ప్రశాంతంగా 'జీఐఎస్'



భద్రతా ఏర్పాట్లపై సీపీ శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

దొండపర్తి(విశాఖ దక్షిణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసింది. రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్‌తో కలిసి స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 8.30 గంటల నుంచే సదస్సుకు ప్రతినిధులు పెద్ద సంఖ్యలో వచ్చారు. మద్దిలపాలెం ఏయూ ఆర్చ్ వద్ద పాస్‌లు ఉన్న వారిని మాత్రమే పోలీసులు లోపలకు అనుమతించారు. సభా ప్రాంగణం వద్ద కూడా ప్రతీ ఒక్కరినీ మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేశారు. అలాగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సుమారు 50 సీసీ కెమెరాల ద్వారా లోపల పరిస్థితులపై నిఘా పెట్టారు. సభ జరిగిన ఆడిటోరియంలోను, ఇతర ప్రాంతాల్లోను మఫ్టీలలో పోలీసులను మోహరించారు. ఒకవైపు భద్రతా ఏర్పాట్లపైనే కాకుండా పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై దృష్టి సారించారు. శ్రీకాకుళం, విజయనగరం నుంచి అలాగే అనకాపల్లి నుంచి వచ్చే భారీ వాహనాలను ఆనందపురం, లంకెలపాలెం మీదుగా మళ్లించారు. దీంతో భారీ వాహనాలు నగరంలోకి రాకపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడలేదు. రెండో రోజు సదస్సుకు కూడా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

థాంక్యూ సీఎం సార్



థాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ముత్తంశెట్టి, నాయకులు

కొమ్మాది (భీమిలి) : గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి భారీ ఎత్తున స్వాగతం లభించింది. రుషికొండలోని రాడిసన్ బ్లూ నుంచి శుక్రవారం ఉదయం సమ్మిట్‌కు బయలుదేరిన సీఎం జగన్‌కు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున థాంక్యూ సీఎం సార్ ప్లకార్డులు ప్రదర్శించారు. భీమిలి, పద్మనాభం, ఆనందపురం, మధురవాడ, కొమ్మాది, సాగర్‌నగర్, ఎండాడ ప్రాంతాలకు చెందిన కార్పొరేటర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వివిధ విభాగాల కన్వీనర్లంతా రుషికొండ నుంచి సాగర్‌నగర్ వరకు దారి పొడువునా పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, రానున్న కాలంలో రాష్ట్రం మరింత అభివృద్ధి కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీతంరాజును గెలిపించి సీఎంకు గిఫ్ట్‌గా ఇద్దాం

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

అల్లిపురం (విశాఖ దక్షిణ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాపరిషత్ దరి ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తనను నమ్ముకున్నవారికి అన్యాయం చేయరని కోలా గురువుల ద్వారా నిరూపణ అయిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని ఉన్న కోలా గురువులకు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారన్నారు. వెనుకబడిన కులాలు, దళితులు, మైనార్టీలతో పాటు అన్ని వర్గాల వారికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రాధాన్యమిస్తున్నారన్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్రలో ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరపున ప్రచారం చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిపై నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దేశాల నుంచి పారిశ్రామిక వేత్తలు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు తరలివచ్చారన్నారు. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నౌకల్లో సాంకేతిక పరిజ్ఞానంపై ఓపెన్ హౌస్



నౌకలను సందర్శించేందుకు వచ్చిన పలు పాఠశాలల విద్యార్థులు



మత్స్య ఉత్పత్తులను పరిశీలిస్తున్న కోస్ట్ గార్డు డీఐజీ యోగేందర్ ధాకా

మహారాణిపేట (విశాఖ దక్షిణ): సముద్ర జలాల్లో మత్స్య సంపదను కనిపెట్టేందుకు భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న రెండు నౌకల్లో సాంకేతిక పరిజ్ఞానంపై మత్స్యకారులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం నౌకల్లో ఓపెన్ హౌస్ నిర్వహించారు.

మత్స్య షికారి, మత్స్య దర్శిని నౌకల్లో ఉన్న విభిన్నమైన ఫిషింగ్ టెక్నిక్స్, అధునాతన పరికరాలు, ఎలక్ట్రానిక్, ఓషనోగ్రఫీకి సంబంధించిన పరికరాలు ప్రదర్శనలో ఉంచారు. సముద్ర జలాల్లో లభ్యమైన వివిధ రకాల చేపలతోపాటు అరుదైన మత్స్య రాశులను, నౌకా పరికరాలు, అగ్నిమాపక, నావిగేషన్, మత్స్య సంపదకు దోహదపడే చేపల ఆవాసాలను ప్రదర్శించారు. ఓపెన్ హౌస్‌ను కోస్టు గార్డ్ డీఐజీ యోగేందర్ ధాకా ప్రారంభించారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కాలేజీ, విశాఖ డిగ్రీ మహిళా కాలేజీ, ఏవీఎన్ కాలేజీ, డాక్టర్ బుల్లయ్య కాలేజీ, సెయింట్ జోసెఫ్ మహిళా కాలేజీ, బీవీకే కాలేజీ, పొలాక్స్ స్కూలు, జీవీఎంసీ హైస్కూల్ (రైల్వే న్యూకాలనీ)కు చెందిన 1200 మందికి పైగా విద్యార్థులు నౌకలను తిలకించారు. కేంద్ర, రాష్ట్ర మత్స్యశాఖల అధికారులు, ఆకాశవాణి అధికారులు పాల్గొన్నారని కార్యాలయ ముఖ్య అధికారి డి.భామిరెడ్డి తెలిపారు.

కల్యాణం.. కమనీయం



ఎదురు సన్నాహ మహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అనంతుని కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, గోదాదేవి విగ్రహాలను పల్లకీలోను, అనంత పద్మనాభస్వామిని గరుడ వాహనంపైన రాజ వీధిలోకి తీసుకువెళ్లి ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహించారు. పెళ్లికొడుకు అనంత పద్మనాభుని పెద్దలు.. పెళ్లి కూతుళ్లు శ్రీదేవి భూదేవి పెద్దలను కట్నకానుకలు ఎంత ఇస్తారని అడిగే ఘట్టం ఆసక్తికరంగా సాగింది. అనంతరం స్వామి వారి కల్యాణం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలు, నాద మునీశ్వరుల నాద స్వరాల నడుమ జరిగింది. త్రిదండి రామానుజ జీయర్‌స్వామి, నెల్లిమర్ల మహా దుర్గా పీఠం వ్యవస్థాపక పీఠాధిపతులు సమతానంద స్వామి, శ్రీదుర్గా మహా పీఠ ఉత్తర పీఠాధిపతులు శ్రవన చైతన్యనంద స్వామి తమ ప్రవచాలను ఇచ్చారు. కార్యక్రమంలో ఈవో ఎస్.నానాజీబాబు, ఎంపీపీ దంపతులు కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి, వైస్ ఎంపీపీ దంపతులు కోరాడ మంజు, లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ దంపతులు తాలాడ పాప, పద్మనాభం బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ పాల్గొన్నారు.

కళల కీర్తి కిరీటి.. కళాభారతి

ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం



కళాభారతి వ్యవస్థాపకుడు భగవత్ శంకరశాస్త్రికి నివాళులర్పిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మద్దిలపాలెం(విశాఖ తూర్పు) : కళలకు నిలయమైన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కళాభారతి వ్యవస్థాపకుడు సుసర్ల సూర్య భగవత్ శంకర్ శాస్త్రి విగ్రహానికి డాక్టర్ పరుచూరి రఘునాథరావు, కళాభారతి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, ట్రస్ట్ ప్రతినిధి పైడా కృష్ణప్రసాద్, త్యాగరాజు ట్రస్ట్ ప్రతినిధి రామ్‌గోపాల్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ త్యాగరాజ స్వామి భక్తులు, సంగీత సాహిత్య ప్రియులైన సుసర్ల సూర్య భగవత్ శంకర్ శాస్త్రి 1988లో చిన్న హాల్‌ను మద్దిలపాలెంలో నెలకొల్పారన్నారు. ఇది అంచెలంచెలుగా కళాభారతి ఆడిటోరియంగా రూపాంతరం చెందిందన్నారు.

రక్తి కట్టించిన పాండవ రాజసూయం

వేడకల్లో భాగంగా హైదరాబాద్‌కు చెందిన భగవాన్ శరణం కల్చరల్ అసోసియేషన్ యాత్రాల్ వారిచే పాండవ రాజసూయం పౌరాణిక పద్య నాటకాన్ని అద్భుతంగా ప్రదరించి రక్తి కట్టించారు. మల్లాది అచ్యుతరామ శాస్త్రి రచించిన ఈ నాటకానికి డాక్టర్ లక్ష్మీకాంత శర్మ దర్శకత్వం వహించారు.

పలువురు కళాకారులకు సత్కారం

వేడుకల్లో భాగంలో పలువురు కళాకారులను సత్కరించారు. గాత్రంలో కృష్ణ ప్రియ, సునాయన, నృత్యంలో వేదాంతం ఎం.ఎస్.ఎస్. వాగ్దేవి ప్రసాద్, కసిరెడ్డి యామిని, మృదంగంలో మల్లాది శివానంద్ యశస్వి, డోలు విభాగంలో పెద్దాడ ప్రసాద్‌లను సత్కరించారు.

సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచుతాం

ప్రతిజ్ఞ చేసిన టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులు



నడుపూరు జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయిని

పెదగంట్యాడ: 'పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకూ పిల్లలను టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచుతామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. వారిని ఆహ్లాదకర వాతావరణంలో చదివిస్తామని, సమతుల ఆహారం అందిస్తామని తెలియజేశారు' నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ క్లాస్ విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఈ విధంగా ప్రతిజ్ఞ చేయించారు ఉపాధ్యాయులు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలంటే తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో ముఖ్యమన్నారు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు టైం టేబుల్ రూపొందించామని, దానిని పాటించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. పరీక్ష విధానం, అధిక మార్కులు సాధించడం, పరీక్షా సమయంలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్యం పాత్రను వివరించారు. విద్యార్థులపై టీవీ, సెల్‌ఫోన్ల ప్రభావం గురించి చర్చించారు. అనంతరం తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పి.నారాయణరావు, జి.ఈశ్వరరావు, ఎన్.రమేష్, ఎస్.సత్యారావు, బి.సుగుణ, టి.వెంకటలక్ష్మి, ఎస్.శోభారాణి, ఎ.సుశీల పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లపై వాచ్‌మన్ సుత్తితో దాడి



గాయపడ్డ కానిస్టేబుల్ కృష్ణారావు, కిశోర్

మర్రిపాలెం: అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ మద్యం తాగి డ్యూటీలో ఉన్న ఇద్దరి కానిస్టేబుళ్లపై దాడి చేశాడు. ఎయిర్‌పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. విమాన్‌నగర్ వద్ద సాయిప్రియ అపార్టుమెంట్‌లో రమ, ఆమె భర్త గోపి కాపలాదారులుగా పనిచేస్తున్నారు. గోపి రాత్రి సమయంలో ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉండడంతో తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. రెండు రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి కూడా గొడవ జరగడంతో.. ఆమె బయటకు వెళ్లి డయల్ 100కి ఫోన్ చేశారు. నైట్‌బీట్‌లో ఉన్న ఎయిర్‌పోర్టు కానిస్టేబుళ్లు కృష్ణారావు, కిశోర్ వారి నివాసం వద్దకు చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న గోపిని వివరాల కోసం విచారించారు. ఈ క్రమంలో గోపి కానిస్టేబుళ్లపై సుత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం సెవెన్ హిల్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనకు కారణమైన గోపిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఓ కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

ఉక్కు కార్మిక నేతల అరెస్ట్



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటాయి. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మెడ్‌టెక్ జోన్ పర్యటనను నిరసిస్తూ శుక్రవారం కూర్మన్నపాలెం కూడలి వద్ద దీక్ష శిబిరం ముందు రోడ్డుపై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు ఆందోళన చేపట్టారు. దీంతో వీరిని పోలీసులు అరెస్టు చేసి ఎయిర్‌పోర్ట్ పోలీస్‌స్టేషన్ తరలించారు. విషయం తెలుసుకున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కార్మిక నేతలను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతోందని తెలిపారు. మంత్రి రాజశేఖర్, సీహెచ్ సన్యాసిరావు, డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, రామస్వామి, బొడ్డు పైడిరాజు, పరంధామయ్య, వెంకటరావు, గుమ్మడి నరేంద్ర తదితర నాయకులు అరెస్ట్ అయిన వారిలో ఉన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మర్రిపాలెం (విశాఖ ఉత్తర): ఆర్థిక ఇబ్బందులు తాళలేక విశాఖలోని రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీవీఎంసీ 53వ వార్డు రైల్వే క్వార్టర్స్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎయిర్ పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన లక్ష్మణ్ (47) మర్రిపాలెం రైల్వే డీజిల్ లోకోషెడ్‌లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యాపిల్లలతో గొడవలు పడుతుండేవాడు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఇంటికి వచ్చి నిద్రపోయాడు. తర్వాత ఇంట్లో ఉన్న పూజ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. శుక్రవారం ఉదయం భార్యా పిల్లలు చూసేసరికి అక్కడ లేకపోవడంతో అలవాటు ప్రకారం మద్యం సేవించి వేరే గదిలో నిద్రపోతున్నాడని అనుకున్నారు. సుమారు 11 గంటల ప్రాంతంలో అనుమానం వచ్చి తలుపులు కొట్టగా ఎంతకీ తీయకపోవడంతో ఇరుగు పొరుగు సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూసేసరికి ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి 9 ఏళ్ల కుమార్తె, 8 ఏళ్ల కుమారుడు ఉన్నారు. ఏఎస్ఐ వాసుదేవరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.